క్లుప్తంగా

పోలీస్ మీట్‌లో దెందులూరు కానిస్టేబుల్ ప్రతిభ


ప్రసన్న

దెందులూరు: దెందులూరు మహిళా కానిస్టేబుల్ ప్రసన్న జిల్లాస్థాయిలో మరోసారి సత్తా చాటింది. గురువారం ఏలూరులో జిల్లాస్థాయి పోలీస్ మీట్ జరిగింది. పోలీస్ మీట్‌లో నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని దెందులూరు పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కె..ప్రసన్న గౌరి షార్ట్‌పుట్‌లో మొదటి స్థానం సాధించింది. అలాగే 100 మీటర్ల పరుగులో మూడో స్థానం సాధించింది. ప్రసన్న గౌరిని హెడ్ కానిస్టేబుల్ హమీద్, గోపి, శేఖర్ తదితరులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహ యజ్ఞం


కొంపెల్ల శివసుబ్రహ్మణ్యశర్మను సన్మానిస్తున్న దృశ్యం

గణపవరం: మండలంలోని కేశవరంలో ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహ యజ్ఞం గురువారంతో ముగిసింది. శ్రీపాద శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో డిసెంబర్ 28న ఆలయ ప్రాంగణంలో సప్తాహ యజ్ఞం ప్రారంభమైంది. యజ్ఞం అనంతరం శ్రీరుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొంపెల్ల శివసుబ్రహ్మణ్యశర్మ భాగవత ప్రవచనం చేశారు. అనంతరం వేణుగోపాల స్వామి కల్యాణం జరిపించారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా శివసుబ్రహ్మణ్యశర్మకు భాగవత కళానిధి బిరుదుతో ఇచ్చి, సువర్ణ కంకణంతో సత్కరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు: మండలంలోని కైకరంలో గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నుంచి వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ద్విచక్రవాహనం పై తల్లి కొడుకులు వెళుతుండగా కైకరం సెంటర్లో కుక్క అడ్డురావడంతో రోడ్డుపై పడిపోయాయి. ప్రమాదంలో కుప్పల రవితేజ, కుప్పల లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు అవార్డులు

ఏలూరు రూరల్ : క్రాంతి జ్యోతి, సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు గుడిమెల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఏలూరు ఎంఈఓ కార్యాలయంలో జి.నాగమణి, సుదర్శనం మేరీ సునీత, సొంగా ఝాన్సీరాణి, ఘంటా నాగభూషణమణి, ఎస్ మీనాక్షి, ఎస్ సరళకుమారి, కె.కుమారి, కారుమూరి వెంకటలక్ష్మి, ఎండీ అక్బరున్నీషావలి, ఎండీ కరీంభేగం అవార్డులు అందుకున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ జె.రవీంద్ర, ఏలూరు జిల్లా డీసీసీబీ సెక్రటరీ ఎ.సర్వేశ్వరరావు, బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిమనోజ్ కుమార్, పి.సాల్మన్, సీహెచ్ దర్మలింగం, జి.వెంకటరమణ పాల్గొన్నారని తెలిపారు.

గుండె నొప్పులపై నిర్లక్ష్యం వద్దు


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ధరణీంద్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గుండె నొప్పులపై నిర్లక్ష్యం వీడాలని డాక్టర్ ఎం.ధరణీంద్ర తెలిపారు. గురువారం స్థానిన సీఆర్ఆర్ మహిళా కళాశాలలో అధునాతన కార్డియో వాస్కులర్ లైఫ్ సపోర్ట్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏటా గుండె నొప్పితో ఆరు లక్షల మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుండెనొప్పికి గురి కావడానికి డీ హైడ్రేషన్, లో షుగర్, కార్డియాక్ అరెస్ట్, మత్తు పదార్థాలు, మద్యపానాలే ప్రధాన కారణమని వివరించారు. గుండెపోటుతో అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తి నాడి కొట్టుకోని పరిస్థితిలో తక్షణమే సీపీఆర్ ప్రారంభించాలన్నారు. ఛాతీ మధ్యలో 5 సెంటీమీటర్ల లోపలికి నొక్కాలని, నిమిషానికి 120 సార్లు నొక్కాలని, ప్రతి 30 కంప్రెషన్స్ తర్వాత రెండు సార్లు అంబు బ్యాగ్ ద్వారా ఊపిరి అందించాలని, అందించే ముందు గడ్డం, తలను పైకి లేపాలని తెలిపారు. వీటన్నింటికంటే ముందు అంబులెన్స్‌కు ఫోన్ చేసి రప్పించి ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ పి.శైలజ పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పండుగ సందడి


భీమడోలు: కొత్త పింఛన్ నగదును వృద్ధురాలికి అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


ఉంగుటూరు: కమ్మ కల్యాణమండపంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు


పెదపాడు: అప్పనవీడులో ఫించన్‌ను అందిస్తున్న దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్

భీమడోలు: ఇచ్చిన మాటకు కట్టుబడిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం వైఎస్సార్ పింఛన్ కానుక కింద నూతనంగా మంజూరైన 127 మంది లబ్ధిదారులకు ఒకొక్కరికి రూ.3 వేల చొప్పున నగదును ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వాసుబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నాలుగేళ్ల ఏడు నెలలుగా నేరవేర్చి లబ్ధిదారులకు రూ.2.60కోట్లలను డీబీటీ, నాన్‌డీబీటీ పద్ధతిలో ఎటువంటి అవినీతికి అస్కారం లేకుండా అందించారన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. భీమడోలు మండలంలో కేవలం 5800 పింఛన్లు ఉండగా ప్రస్తుతం 9036 పింఛన్లుకు పెరిగాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పరిపాలనలో సంస్కరణలు చేసి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థలో 1.25లక్షలు, ఇతర శాఖాల్లో 60వేలు ఉద్యోగాలు అందించారని, వాటిలో పాటు 2.4 లక్షల వలంటీర్లను నియమించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరా గాంధీ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, ఉంగుటూరు నియోజకవర్గ జగన్‌సేవాదళ్ కన్వీనర్ తుమ్మగుంట రంగ, సర్పంచులు దాయం సుజాత, గుడివాడ నాగగౌతమి, మానుకొండ నాగేశ్వరరావు, వెజ్జు బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు ఇంజేటి జూనియర్, గంటా శ్రీనివాసరావు, ఆజామ్, అంబటి దేవీ, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు మద్దాల అప్పారావు పాల్గొన్నారు.

జగనన్న ఆశీర్వదించాలి

ఉంగుటూరు: ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో గురువారం పెంచిన పింఛన్లతో పాటు ఈ నెల నుంచి కొత్తగా మంజూరైన 153 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అనంతరం నిర్వహించిన సభలో వాసుబాబు మాట్లాడుతూ ఎన్నికల వేళ మీ ముందుకు వచ్చే వివిధపార్టీల నాయకుల కల్లబొల్లిమాటలు నమ్మవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, సర్పంచుల చాంబర్ మండల అధ్యక్షుడు పి.వి ష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెదపాడులో..

పెదపాడు: ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్‌ను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ సూచించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో ఇటీవల ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్ రూ.3 వేలను అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతూ వెళ్తానని ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు అందిస్తున్నారని రాబోయే రోజుల్లో మరింత ఎక్కువ ఇవ్వాలంటే మళ్లీ ఆయనను ఆదరించాల్సిన అవసరముందని తెలిపారు. పేదల ప్రజల ఇంట్లో సంక్రాంతి ముందే వచ్చినట్లైందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనుల పరిశీలన


సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: పెదపాడు–పెరికీడీ సీసీ రహదారి పనులను ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. రహదారి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలుకు అనుగుణంగా రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఆమె వెంట జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు ఎంపీడీఓ సబ్బితి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన

పెదపాడు: నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు పాఠశాల మైదానం మెరక చేసేందుకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట జిల్లా బీసీ సెల్ అధ్యక్షడు, నరసాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, సత్యవోలు, ఎస్.కొత్తపల్లి గ్రామాల సర్పంచ్‌లు రంభ ఉమామహేశ్వరి, చేపేని రంగారావు, వైకుంఠపు ధనంజయ్, వైకుంఠపు రమేష్, పెంకి శ్రీనివాసరావు ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి


పిల్లలకు ట్యాబ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు


ప్రత్తికోళ్లలంకలో ఇంటి స్థలం అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

కొల్లేరు గ్రామాల్లో అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి చూసి ఓటు వేయాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రజలను కోరారు. బుధవారం రాత్రి పల్లె నిద్ర చేసిన ఎమ్మెల్యే గురువారం ఉదయం ప్రత్తికోళ్లలంక, సాయంత్రం కొక్కిరాయిలంకలో తన ప్రజా ఆశీర్వాద యాత్రను కొనసాగించారు. ప్రత్తికోళ్లలంక గ్రామ కూడలిలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో టీడీపీ నాయకులు పథకాల ఆశ చూపి కొల్లేరు గ్రామాల ప్రజలను వర్గాలుగా విభజించి అధికారం చెలాయించారని గుర్తుచేశారు. నేడు వైఎస్సార్ సీపీ పాలనలో కులం, మతం, వర్గభేదం లేకుండా లంకగ్రామాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఊరులో తాగునీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్, కుళాయితో పాటు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించామన్నారు. సుమారు రూ.కోటి ఖర్చు చేసి ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ క్లినిక్ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. టీడీపీ అబద్దాలకు మోసపోవద్దని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి, ఏలూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ఆలోచనలను అమలు చేస్తోన్న నాయకుల్లో అబ్బయ్యచౌదరి ఒకరని కొనియాడారు. పథకాలు అమలు కావాలంటే మరోసారి అబ్బయ్యచౌదరిని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. తొలుత మండల పరిషత్ నిధులు రూ.25 లక్షల బీసీ కాలనీలో అభివృద్ధి చేసిన సీసీ రోడ్లు, మరో రూ.13. 44 లక్షల నాడు నేడు నిధులతో చేపట్టిన మండల పరిషత్ పాఠశాల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గడప గడపకు వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ లబ్ధిని వివరించారు. కొత్త లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. అక్కడ నుంచి పాదయాత్రగా కొక్కిరాయిలంక చేరుకున్నారు. ఎస్సీ కాలనీలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అక్కడ నుంచి గుడివాకలంక చేరుకుని రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఉదయం మొండికోడు, మాధవాపురం, కోటేశ్వరదుర్గాపురం, తిమ్మారావుగూడెం వరకు పాదయాత్ర చేసి, చాటపర్రులో పల్లె నిద్ర చేయనున్నారు. ఎమ్మెల్యే వెంట వడ్డికుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీడీపీ బి.ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈఓ–2 రంగయ్య, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, మండల కొండలరావు, సర్పంచ్‌లు ఘంటసాల మహలక్ష్మీరాజు, తోకల అమల పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి


భీమడోలులో సీహెచ్‌సీ ఓపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలంతా రుణపడి ఉంటామని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో నాబార్డ్ నిధులు రూ.1.30 కోట్లతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. 9 తరగతి గదులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించారు. అదే విధంగా 30 పడకల భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డ్ నిధులు రూ.2.30కోట్లతో ఆధునీకరించిన ఓపీ బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. ప్రతి విభాగాన్ని సందర్శించి అక్కడ రోగులకు చేసే వైద్య సేవల వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్య సంస్కరణల ద్వారా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్న తపనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసుపత్రులను ఆధునీకీకరించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.శ్యాం సుందర్, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవానీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చింతా శ్రీరామచంద్రమూర్తి, డీసీహెచ్ పాల్ సతీష్, డీఐఓ ఎం.నాగేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డి.సునీత, హెచ్ఎం బి.శ్రీనివాసరావు, ఎంఈఓ భాస్కర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలి


శ్రీరామవరంలో వైఎస్సార్ సీపీ దెందులూరు మండల నూతన కమిటీతో కామిరెడ్డి నాని

దెందులూరు: మండల వైఎస్సార్ సీపీ నూతన కమిటీ సమన్వయం, అంకితభావం, ప్రణాళికతో వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి విశిష్ట సేవలందించాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం శ్రీరామవరంలో నూతన కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారుఅబ్బయ్య చౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మీ సేవలను గుర్తించి, గౌరవించి మండల కమిటీలోకి తీసుకున్నారన్నారు. నియోజకవర్గంలో దెందులూరు మండల కమిటీ జిల్లాలోని ఆదర్శవంతమైన కమిటీగా సేవలందించేలా కృషి చేయాలని కోరారు.

వైభవంగా ఫాదర్ అమ్మన్‌రాజా సిల్వర్‌జూబ్లీ వేడుకలు


దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో దివ్య పూజాబలి అర్పిస్తున్న ఫాదర్లు

దెందులూరు: ఆధ్యాత్మిక విద్య, వైద్య, సామాజిక సేవా రంగాల్లో 25 ఏళ్ల పాటు ఆదర్శవంతమైన సేవలందించిన దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అమ్మన్‌రాజా ఆదర్శప్రాయులని ఏలూరు పీఠాధిపతి వికార్ జనరల్ డాక్టర్ పి.బాల, సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల ప్రొక్యూరేటర్ ఫాదర్ రాజు అన్నారు. గురువారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ అమ్మన్‌రాజా సిల్వర్ జూబ్లీ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల నుండి 123 మంది ఫాదర్లు, సిస్టర్లు, బ్రదర్లు, ఆర్‌సీఎం సంఘపెద్దలు, మరియదళ సభ్యులు, సంఘస్తులు, ఆర్‌సీఎం టీచర్లు, యువత, సండే స్కూల్ చిన్నారులు అధిక సంఖ్యలో హాజర య్యారు. తొలుత చాన్సలర్ బాబు జార్జీ, ఫాదర్లు మైఖేల్, పాస్కలీ, డేవిడ్, గ్జేవియర్, లిల్లిపియర్లతో పాటు 118 మంది ఫాదర్లు అమ్మన్ రాజాతో కలిసి దివ్య పూజా బలి అర్పించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

మంచినీటి సమస్యకు పరిష్కారం

భీమడోలు: పోలసానిపల్లిలో పదో వార్డులో నెలకొన్న మంచినీటి సమస్యను గురువారం ఎంపీటీసీ సభ్యురాలు అంబటి దేవీ, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు చెరుకూరి మధు తదితరులు గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని పదో వార్డులోని కాలనీ వాసులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఏరియాలోని మంచినీటి కనెక్షన్ సర్వీసులు ఏడు గంటల వ్యవసాయ కనెక్షన్‌పై ఉందని, ఆ కనెక్షన్‌ను 24 గంటల విద్యుత్ సరఫరా చేసే సర్వీస్‌లోకి మారిస్తే మంచినీటి సమస్య పరిష్కారమవుతుందని, మంచినీటి పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. తక్షణమే స్పందించిన వాసుబాబు సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. మంచినీటి కనెక్షన్‌ను వెంటనే 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే సర్వీసులోకి మార్చాలని కోరారు. పైపులైన్‌కు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని వాసుబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు రాజారత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు చిలపర్తి రామారాయుడు, కాళి రవి, బి.రమేష్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ప్రదర్శించిన సంగీత, హరికథ, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సాయంత్రం నగరానికి చెందిన వెంపరాల రామలక్ష్మీ శాస్త్రి శ్రీరామ గానలహరి గానం భక్తులను అలరించింది. ముదపాక బాలసుందరం భాగవతార్ విరాటపర్వం అంశంపై చేసిన హరికథా కాలక్షేపం ఆకట్టుకుంది. రాత్రి నగరానికి చెందిన నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్ధ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేశారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణపవరం: మండలంలోని వరదరాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గణపవరం, కొత్తపల్లి, వరదరాజపురం, వెలగపల్లి, జల్లికొమ్మర, వీరేశ్వరపురం, వాకపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముమ్మరంగా వరినాట్లు


దోసపాడులో నాట్లు వేస్తున్న కూలీలు

దెందులూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. కొవ్వలి, దోసపాడు, ఉండ్రావరం, పోతునూరు, శ్రీరామవరం, చల్లచింతలపూడి, సోమవరప్పాడు గ్రామాల్లో బోర్ల కింద రైతులు నాట్లు వేస్తున్నారు. రైతులు మహిళలకు బదులుగా బీహార్ నుంచి కూలీలను తీసుకువచ్చి తాడు పట్టుకుని నాట్లు వేసే పద్ధతిని అన్ని గ్రామాల్లో పాటిస్తున్నారు. గ్రామగ్రామాన బీహార్ నుంచి వచ్చిన యువకులు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు నేడు విధుల్లో చేరాలి


అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ కేపీవీఎల్ పద్మావతి

పెదపాడు: అంగన్‌వాడీలు చేస్తున్న ధర్నాను విరమించి శుక్రవారం విధుల్లో చేరాలని ఐసీడీఎస్ పీడీ కేపీవీఎల్ పద్మావతి కోరారు. పెదపాడు బళ్ల రేవుతూము సెంటర్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సమ్మె శిబిరం వద్దకు చేరుకుని వారికి పలు సూచనలు సలహాలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలకు ఆటంకం ఏర్పడిన కారణంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, అణగారిన వర్గాల ప్రయోజనాలు దృష్ట్యా అంగన్‌వాడీలు సమ్మె విరమించాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వం కూడా ఒకటి రెండు మినహా ప్రధాన సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి, ఏసీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు వి.మల్లిక తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెదపాడు: నూతన సంవత్సర క్యాలెండర్‌లను ముద్రించి పలువురికి అందించడం మంచి పరిణామమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ వద్ద ఏలూరు బీసీ సెల్ టౌన్ అధ్యక్షుడు లక్కోజు గోపి తయారు చేయించిన క్యాలెండరు గురువారం ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ మాట్లాడుతూ ప్రతీ ఏటా గోపి క్యాలెండర్లు వేయించి పంపిణీ చేయడం ఎంతో ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో బంకురు వెంకట్,పలువురు బీసీనాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన ఇలా

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శుక్రవారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిడమర్రు మండలానికి సంబంధించిన పింఛన్‌దారులకు పెంచిన 3 వేల రూపాయలను లబ్ధిదారులకు అందజేస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదలైంది. మధ్యాహ్నం 3 గంటలకు గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో గణపవరం మండలానికి సంబంధించిన పింఛన్ దారులకు పెంచిన పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.